క్లుప్తంగా

జామా మసీదు కార్యవర్గం

నిర్మల్: నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని జామా మసీదు నూతన కమిటీ సభ్యులను శుక్రవారం ఎన్నుకున్నారు. సదర్‌గా జమీల్‌షా, నయాబ్ సదర్‌గా మొయినొద్దీన్, జనరల్ సెక్రటరీగా సలావుద్దీన్, కోశాధికారిగా బాబు ఎన్నికయ్యారు. సభ్యులుగా లతీఫ్, ఇలియాస్, ఫైసల్, షారుక్, సాహెల్ హైమద్‌ఖాన్, సబీర్‌ఖాన్, మొహీమ్ ఎన్నికయ్యారు.

మండల కార్యవర్గం



కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

సారంగాపూర్: విశ్వబ్రాహ్మణ సంఘం మండల కార్యవర్గాన్ని శుక్రవారం సారంగాపూర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా తుపాకుల వెంకటరమణ, కార్యదర్శిగా మధు, కోశాధికారిగా ఎన్.నర్సయ్య, సభ్యులుగా వెలిశాల వెంకటేశ్, శ్రీగాదె గోవర్ధన్, వెలిశాల శ్రీనివాస్, అనిల్, గంగాధర్ ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని సభ్యులు సత్కరించారు.

రోడ్డు కష్టాలు తీర్చండి



నిరసన తెలుపుతున్న ధర్మాజీపేట్ గ్రామస్తులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బురద రోడ్లపై ధర్మాజీపేట్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

భైంసాలో జోరు వాన

భైంసాటౌన్: పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం చిరుజల్లులు.. సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం కాగా డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. ఇక ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరద వస్తోంది. శుక్రవారం ప్రాజెక్టుకు 1100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అధికారులు ఒక గేటు ఎత్తి 3,300 క్యూ సెక్కుల నీటిని దిగువకు వదులుతున్నా రు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా.. ప్రస్తుతం 358.60 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తున్నారు.

కళాశాలలో స్వాగతోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లోకేశ్వరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రిన్సిపాల్ గౌతమ్ అన్నారు. శుక్రవారం లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం బతుకమ్మ ఆడిపాడారు. అధ్యాపకులు చిన్నయ్య, వినోద్, వెంకటేశ్వర్లు, హరీశ్, విఠల్, శ్రీనివాస్, మహేందర్ ఉన్నారు.

కోతుల బెడద తీర్చాలి



రేంజ్ కార్యాలయం వద్ద మహిళలు

కడెం: కోతుల బెడద తీర్చాలని మండలకేంద్రానికి చెందిన మహిళలు శుక్రవారం తహసీల్దార్ ప్రభాకర్, అటవీ, గ్రామపంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కడెంలో కోతుల సంఖ్య పెరగడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నామని వాపోయారు. మహిళలు, చిన్నారులపై దాడులు చేసి ఇంట్లోని సామగ్రి ఎత్తుకెళ్తున్నాయని.. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఏచూరి' సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏచూరి మరణం విప్లవకారులకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూతన్‌కుమార్, నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, రాజేశ్, భూమన్న, శంకర్ తదితరులున్నారు.

అభివృద్ధికి ఆది కర్మయోగి

- గిరిజన గ్రామాల్లో వసతుల కల్పనకు యాక్షన్ ప్లాన్
- త్వరలో ఇంటింటికీ అధికారుల బృందం
- ఇప్పటికే సిబ్బందికి పూర్తయిన శిక్షణ



ఆది కర్మయోగి పథకంపై సిబ్బందికి శిక్షణనిస్తున్న అధికారులు

మామడ: స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా.. నేటికి పలు గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలు కరువయ్యాయి. ఆయా చోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అమలు చేసి గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద మొదటి విడతలో జిల్లాలో 32 గ్రామాలను ఎంపిక చేశారు. పలు శాఖల అధికారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గిరిజన సంఘాల నాయకుల భాగస్వామ్యంతో ఆయా గ్రామాలను అభివృద్ధి చేస్తారు.

ఆది కర్మయోగి అభియాన్ పథకం కింద ఎంపికైన గ్రామాల్లో వివిధ శాఖలతో కూడిన అధికారుల బృందాలు ఇంటింటా సర్వే నిర్వహించనున్నారు. సర్వేలో నమోదు చేసే విషయాలపై అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తిచేశారు.

అన్నిరంగాలు అభివృద్ధి చెందేలా..

ఎంపికైన గ్రామాల్లో గిరిజన సంక్షేమం, విద్య, వైద్యం, అటవీ వనరులు, రోడ్లు, పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖ అంశాలను అధికారుల బృందాలు పరిశీలించి వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు.

పోషకాహారం, సమగ్రవిద్య, మెరుగైన పారిశుద్ధ్యం, శుభ్రమైన నీరు, పక్కా ఇళ్లు తదితర వివరాలను సర్వే ద్వారా సేకరిస్తారు. గ్రామాన్ని మ్యాపింగ్ చేసి సాగు, తాగునీటి వసతులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వీధిదీపాలు, మురుగు కాల్వల నిర్మాణం, వ్యవసాయం, ధాన్యం గిడ్డంగుల సౌకర్యం, క్రీడా మైదానాలు, రేషన్ దుకాణాలు, పాఠశాలలు, వసతి తదితర అంశాలను నమోదు చేసుకుంటారు.

జిల్లాలోని 32 గ్రామాల్లో..

ఆది కర్మయోగి అభియాన్ కింద మొదటి విడతలో జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 32 గ్రామాలను ఎంపికచేశారు. మామడ మండలంలో ఏడు గ్రామాలు(తాండ్ర, రాశిమెట్ల, గాయిద్‌పల్లి, కిషన్‌రావుపేట్, లింగాపూర్, రాయదారి, కప్పన్‌పల్లి), పెంబి మండలంలో 10 గ్రామాలు (పసుపుల, ఇటిక్యాల్, గుమ్మనయెంగ్లాపూర్, షెట్‌పెల్లి, వెంకంపోచంపాడ్, దోందారి, వస్పల్లి, కోసగుట్ట, పెంబి, మందపల్లి) కుభీర్‌లో ఆరు గ్రామాలు (రంజని, సిర్పల్లి, దొడర్న, బ్రహ్మేశ్వర్, మర్లగొండ,శివాని) సారంగపూర్ మండలంలో మూడు గ్రామాలు (పోట్యా, కుప్టి, నాగాపూర్) నర్సాపూర్(జి) మండలంలో రెండు గ్రామాలు (బూర్గుపల్లి(జి), అంజని) దిలావర్‌పూర్ మండలంలో మాలెగాం, కడెం మండలంలో గంగాపూర్, నిర్మల్‌రూరల్ మండలంలో రాణాపూర్, తానూరు మండలంలో మసల్గా ఎంపికయ్యాయి. అధికారుల బృందాలు గ్రామాల్లో పర్యటించి కల్పించి వివరాలు నమోదు చేస్తారు.

అవగాహన కల్పిస్తాం



ఎంపిక చేసిన గ్రామాలకు అధికారుల బృందం వెళ్లి ఆది కర్మయోగి అభియాన్ పథకం ప్రయోజనాలను గిరిజనులకు వివరిస్తుంది. గ్రామాల్లో అవసరమైన వసతులకు సంబంధించి వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు అందిస్తాం. ప్రజలు కూడా సహకరించాలి.

– సుశీల్‌రెడ్డి, ఎంపీడీఓ, మామడ

సౌకర్యాలు మెరుగుపర్చాలి



ఆది కర్మయోగి పథకం ప్రయోజనాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలి. గిరిజన గ్రామాలలో కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం. మాకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలి.

– రాందాస్, మాజీ సర్పంచ్, గాయిద్‌పల్లి

రోగులతో పీహెచ్‌సీ కిటకిట



కుభీర్‌లో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ విజయ్

కుభీర్: భారీవర్షాల కారణంగా సాధారణ జ్వరాలతోపాటు డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. శుక్రవారం కుభీర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రోగులతో నిండిపోయింది. సాధారణ రోజుల్లో నిత్యం 80 నుంచి 100 వరకు ఓపీ పేషెంట్లు రాగా.. 10 రోజులుగా 150 నుంచి 170 వరకు ఓపీ ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. 10 మంది ఇన్ పేషెంట్లు ఉన్నారు. ఆసుపత్రిలో మరుగుదొడ్లకు నీరు రాక రోగులు ఇబ్బంది పడుతున్నారు. రోజుకు 150 మందికి పైగా ఆసుపత్రికి వస్తున్నారని రాథోడ్ విజయ్ పేర్కొన్నారు.

17 నుంచి బీజేపీ సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న మెడిసిమ్మె రాజు

నిర్మల్‌రూరల్: బీజేపీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం(ఈనెల17) నుంచి గాంధీజయంతి(అక్టోబర్ 2) వరకు సేవా పక్షంలో భాగంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కన్వీనర్ మెడిసిమ్మె రాజు తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన పట్టణ కార్యశాలలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న అన్ని మండలకేంద్రాలు, పట్టణాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 18న ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ అంశాలపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు, 18న మండలకేంద్రాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించాలని సూచించారు. 25న ప్రవాస్ బూత్‌స్థాయిలో మొక్కలు నాటి దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో మేధావులతో సమావేశం, డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందన్నారు. 27న దివ్యాంగులను సన్మానించి ఉపకరణాలను పంపిణీ చేస్తామన్నారు. అక్టోబర్ 2న లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఇందులో ముత్యంరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, అలివేలు మంగ, ఒడిశాల అర్జున్, సుంకరి సాయి, ఆకుల కార్తీక్, గిల్లి విజయ్ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ఖానాపూర్: మహిళలు నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్, మెప్మా పీడీ సుభాశ్ అన్నారు. ఈడీఐఐ ఆధ్వర్యంలో అగ్రో మిల్లెట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులపై శుక్రవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహిళలు తయారుచేసే వస్తువులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అందించే సహకారం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్రవంతి, రవీందర్, దేవేందర్, రవి, అలేఖ్య, తదితరులు ఉన్నారు.

ఆగిన లారీలు.. నిలిచిన రాకపోకలు



బురదలో దిగబడిన రెండు లారీలు



పంచగుడి వద్ద నిలిచిపోయిన బియ్యం లారీలు

లోకేశ్వరం: జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలో రెండు లారీలు నడి రోడ్డుపై బురదలో కూరుకుపోయాయి. దీంతో నిజామాబాద్‌కు వెళ్లే వాహనాల రాకపోకలు శుక్రవారం తెల్లవారుజాము నుంచి నిలిచిపోయాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి మండలంలోని నగర్ గ్రామ సమీపంలోని గోదాంకు రేషన్‌బియ్యం తరలిస్తున్నారు. బోధన్‌లో రేషన్ బియ్యం లోడ్ చేసుకుని నగర్ గోదాంకు తరలిస్తుండగా పంచగుడి గ్రామ సమీపంలోని నడి రోడ్డుపై ఓ లారీ నిలిచిపోయింది. ఆ పక్కన కంకర లారీ బురదలో దిగబడింది. దీంతో మూడు గంటలు లోకేశ్వరం నుంచి నిజామాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సమీక్ష



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జీవరత్నం

నిర్మల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి అంజిప్రసాద్ సూచించారు. శుక్రవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీఎం గంగామణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కుభీర్‌లో..

కుభీర్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకొని వాయిదాల పద్ధతిలో చెల్లించాలని మేజర్ గ్రామపంచాయతీ ఈవో విజయ్ అన్నారు. కుభీర్‌లో 90 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. శుక్రవారం లబ్ధిదారులతో ఐకేపీ(ఇందిరా క్రాంతి పథకం) వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌హెచ్‌జీలో సభ్యులుగా ఉంటే స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకొని ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. ఐకేపీ సీసీ భూమన్న, కారోబార్లు పి.బాబు, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేలా సిబ్బంది దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తర్లపాడ్‌లో రెండు ఇళ్లను పూర్తి చేసేందుకు కృషి చేసిన గ్రామస్తుడు సార్ల నర్సయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో హౌజింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవో రత్నాకర్‌రావు, హౌజింగ్ ఏఈ ఖయ్యూం తదితరులున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తానూరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరం ఉంటూ క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆనందిత ఫౌండేషన్ చైర్మన్, మోటివేషనల్ స్పీకర్ వాగేకర్ లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం తానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సక్సెస్ గైడెన్స్, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్, యాంటి డ్రగ్స్ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి



నారాయణరావుతో గన్నోర గ్రామస్తులు

భైంసాటౌన్: తమ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు తదితర సమస్యలు పరిష్కరించాలని ముధోల్ మండలం గన్నోరా గ్రామ వీడీసీ సభ్యులు కోరారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, గన్నోర వీడీసీ సభ్యులు భోజేందర్‌రెడ్డి, నర్సారెడ్డి, శ్రీకాంత్, రాజు, ప్రసాద్, శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో యూనియన్‌లో చేరిక

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో శుక్రవారం టీఎన్‌జీవో అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కడెం మండలంలోని బెల్లాల్, కడెం సెక్టార్‌లోని పలువురు టీచర్లు, హెల్పర్లు ఏఐటీయూసీ యూనియన్ నుంచి టీఎన్‌జీవో అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌లో చేరారని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఐసీడీఎస్‌లో ఖాళీ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేసి అంగన్‌వాడీ టీచర్లకు బెనిఫిట్స్ వర్తింపజేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు విజయ, నిర్మల, రత్నమాల, మంగ, లక్ష్మి, జ్యోతి, భాగ్యరేఖ, బాలమణి తదితరులున్నారు.

విద్యార్థుల ప్రతిభ

సారంగాపూర్: జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కళాఉత్సవం–2025లో మండలంలోని జామ్ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు సమీక్ష, శ్రావణి, నందిని, బైపీసీ విద్యార్థిని వర్ష త్రీడీ విజువల్ సీనియర్స్ విభాగంలో ద్వితీయ బహుమతి, విజువల్ త్రీడీ విభాగంలో పదో తరగతి విద్యార్థినికి సైతం ద్వితీయ బహుమతి వరించింది. విద్యార్థులను ప్రిన్సిపాల్ సంగీత, సిబ్బంది అభినందించారు.

జిల్లాస్థాయి యోగా పోటీల్లో..

ముధోల్: మండలకేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తానూర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో పాఠశాల విద్యార్థి చోర్మారే గితేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు సారథి రాజు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

ఎరువుల కొరత తీర్చాలి

ఖానాపూర్: రైతులకు ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సత్తన్‌పల్లి పీఏసీఎస్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకొని రైతులకు అందించాలని కోరారు. ఆయన వెంట రైతులు తదితరులు ఉన్నారు.

పంటల సర్వే నిర్వహించాలని ఆందోళన

కడెం: మండలంలోని అల్లంపల్లి క్లస్టర్ పరిధిలో పంటనష్టం సర్వే నిర్వహించాలని రైతులు శుక్రవారం ఆందోళన చేశారు. గంగాపూర్, అల్లంపల్లి గ్రామపంచాయతీల రైతులు కడెంలో వ్యవసాయాధికారులను నిలదీశారు. వర్షాలకు పంటలు దెబ్బతిన్న అధికారులు సర్వే చేయడం లేదని మండిపడ్డారు. అధికారులు సర్వేకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించా రు.

తహసీల్దార్‌కు వినతి

సారంగపూర్: అర్హులైన నిరుపేదలకు రూ.60 వేలలోపు ఆదాయ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్‌లు తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2017 ఏప్రిల్ తర్వాత కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం కింద రూ.20వేలు ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. రూ.60వేలలోపు ఆదాయం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నాయకులు కోర్వ నవీన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నిర్మల్: నర్సాపూర్(జి) మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, ఉమామహేశ్వర్ గణేశ్‌పటేల్, సాయిబాబా, బాలాజీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్, వడ్యాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శని వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుంటాల: మండలంలోని కల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖానాపూర్: పట్టణంతోపాటు ఖానాపూర్, కడెం, పెంబి మండలాల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. ఖానాపూర్, సుర్జాపూర్, పాతఎల్లాపూర్, సత్తన్‌పల్లి, బీర్నంది, కడెం, లింగాపూర్, బెల్లాల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

'పత్తి దిగుమతులపై సుంకం విధించాలి'



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు రాజు

భైంసాటౌన్: పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాలను ఎత్తివేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పత్తి దిగుమతులపై 50శాతం సుంకాలు విధించాలని.. పత్తి కొనుగోళ్లలో పీడీపీఎస్(ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం) విధానం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పత్తి రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. పాత విధానంలో సీసీఐ ద్వారానే పత్తి కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దీనాజీ, విఠల్, సురేశ్, సాయినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సాయుధపోరాట వారోత్సవాలు ప్రారంభం

ఖానాపూర్: తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాలు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో వారోత్సవాల ర్యాలీని నాయకులు ప్రారంభించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఉమ్మడి జిల్లా చరిత్రను నాయకులు వివరించారు. కమ్యూనిస్టులు చేసిన సాయుధ పోరాటాల ఫలితంగానే నిజాం తలొగ్గి హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి భూక్య రమేశ్, నాయకులు ఎస్ఎన్.రెడ్డి, నర్సింహులు, బీమేశ్, రమేశ్, గంగాధర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన పార్‌పల్లి సమస్య



వాహనాల తాళాలు అప్పగిస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద:మండలంలోని పార్‌పల్లి గ్రామ సమస్య కొలిక్కి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఈ నెల 6న మండలంలోని పార్‌పల్లి గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను గ్రామస్తులు, యూత్ సభ్యులు గ్రామంలోకి తీసుకెళ్లారు. శుక్రవారం తహసీల్దర్ సరిత, సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి పార్‌పల్లి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. పార్‌పల్లి–పొట్టపల్లి గ్రామాల సరిహద్దులను త్వరగా చూపుతామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు జేసీబీ, ట్రాక్టర్ల తాళాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. పోలీస్ స్టేషన్‌కు తరలించామని.. జరిమానా విధించిన తర్వాత వాహనాలను వదిలేస్తామని అధికారులు తెలిపారు. ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.